# స్వర్గీయ దీక్షితులు, విశ్వనాథల ప్రశంస

## రసధుని సెప్టెంబరు నెల ప్రసార విశేషాలు

ఖమ్మం, అక్టో 4

సెప్టెంబరు నెల రసధుని ప్రసారం ఖమ్మం వర్తకసంఘ భవనంలో 25వ తేదీన జరిగింది. ఈ ప్రసారం ఇటీవలనే స్వర్గస్థులైన కథక చక్రవర్తి, బాల సాహితీ స్రష్ట శ్రీ చింతా దీక్షితులు దివ్యస్మృతికి అంకితము చేయబడింది.

PAGE1

ఈ ప్రసారంలో రసధుని ప్రత్యేక ఆహ్వానంమీద ప్రసంగిస్తూ శ్రీ మాదిరాజు రంగారావు, రసధుని కార్యక్రమాలను అభినందిస్తూ స్వర్గీయులైన శ్రీ దీక్షితులు గారికి యీ నెల రసధుని కార్యక్రమం అంకితం చేయడము చాలా సమంజసంగాఉందని అన్నారు. శ్రీ దీక్షితులు ప్రజ్ఞా సమన్వితమైన పరిణత మనస్కులనీ, ఆయన హృదయం ఒక సుధాకలశం లాంటిదనీ, ఎలాంటి ప్రాపంచక సంక్లిష్టతలనైనా చిరుహాసంతో భరించేవారనీఅన్నారు. శ్రీ దీక్షితులు మానసికంగా ఉన్నతమైన మనిషి. నాస్తికులైన చలంగారి దృష్టిని రమణాశ్రమం వైపు మరల్చిన అమేయ శక్తిసంపన్నులు శ్రీ చింతా దీక్షితులు అని అన్నారు.

శ్రీ రంగారావు ఇంకా తెలుగు సాహిత్యంలోని నూతనత్వాన్ని, వైవిధ్యాన్ని గూర్చి విపులముగా ప్రసంగం చేశారు.

ఇప్పటి తెలుగు సాహిత్యంలో ఒక వినూతనమైన మార్పు గోచరిస్తున్నది. ఇంతకు క్రితం కేవలం శబ్ద తీవ్రతను బట్టి సాగే రచనా ప్రవృత్తి క్రమంగా లుప్తమై, ఆలోచనాత్మకమైన రచనలు సాగించబడు స్థితికి నేడు చేరుకుంటున్నది. ఇందుకు కారణం కవి బహిర్ముఖత్వం వీడి, అంతర్ముఖత్వాన్ని ఆశ్రయించడమే. ఆధునిక యుగంలో సంస్కృతి గత సమ బుద్ధితో, ఆలోచనా మార్గానికి చెందిన ఠాగూరు, అరవిందులవంటి మహాకవులతో ఆరంభమైన కావ్యసృష్టి. విశ్వనాథ కవితా తపఃఫలమైన రామాయణ కల్పవృక్షంతో పరిణతమైన స్థితికి చేరుకుంటున్నది. అచంచల దీక్షతో కథాకథన శిల్పాభిరామంగా, అనంత కల్పనా చతురతతో, సర్వ రస సామగ్రి

సమగ్రంగా రచన సాగిన మహో కావ్యము "రామాయణ కల్పవృక్షం". శిల్పమన్న మాటకు ఒక నిర్దిష్టమైన నిర్వచనం చెప్పడం కష్టం. ఈ శిల్ప మన్నది ఒక ఆలోచనతో కూడుకొని, సర్వాంగీణంగా రస సంబంధి అయి వుంటుంది. ఇది రచయిత శక్తిమీద ఆధారపడివుంటుంది. ఊహ చేయగల వారికి తెలుస్తుంది. ఆదినుంచీ యిప్పటివరకూ కవితాత్మ ఒక్కటే. కాని, అది రచయిత మనోదశనూ, ఊహాశక్తినీ అనుసరించివుంటుంది. తెలుగు సాహిత్యంలో విశ్వనాథ విహరించని మార్గం లేదు. చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు. పట్టినదల్లా బంగారం చేయగల గాఢ ప్రతిభుడు- తెలుగులో మొదట గేయ కావ్యము వ్రాసిన ప్రశస్తి శ్రీ విశ్వనాథకే దక్కుతుంది. అందుకే విశ్వనాథ సత్యనారాయణ యీ యుగానికి అధినేత" అని శ్రీ మాదిరాజు అన్నారు.



Golconda Patrika, Vol 13, 245, 05-10-1960